క్లుప్తంగా

దొంగలు హల్ చల్

● మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

బల్లికురవ: ఇంటి వరండాలో నిద్రిస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీకి గురైంది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలోని పెదఅబడిపూడి బీసీ కాలనీలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. షేక్ ఖాదరమ్మ మంగళవారం రాత్రి భోజనం చేశాక ఇంటి వరండాలో నిద్రిస్తోంది. సుమారు 2 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి మెడలో రెండున్నర సవర్ల బంగారు గొలుసు లాక్కొని గేటు తీసుకుని వెళుతున్నాడు. నిద్రలో నుంచి మేల్కొన్న ఖాదరమ్మ దొంగ.. దొంగని అరవడంతో మనమడు అనిల్ వెబండించాడు. వర్షం , విద్యుత్ సరఫరా లేకపోవటంతో ఫలితం లేకుండా పోయింది. బుధవారం అనిల్ బల్లికురవ పోలీస్ స్టేషనల్‌లో ఫిర్యాదు చేశాడు. ఇటీవల మండలంలో దొంగతనాలు ఎక్కువ అవటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం గుంటుపల్లి గ్రామంలోని పోలేరమ్మ అమ్మవారి మెడలో గొలుసును అపహరించారు. ఇప్పటికైనా పోలీస్ శాఖ దొంగతనాలకు చెక్‌పెట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

సిమెంట్ బల్లల ఏర్పాటు



సిమెంటు బల్లలు ఏర్పాటు చేసిన రొటేరియన్ శ్రీలక్ష్మి

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రొటేరియన్ నర్రా శ్రీలక్ష్మీ పుట్టిన రోజు సందర్భంగా అద్దంకి పట్టణం సమీపంలోని వేలమూరిపాడు రోడ్‌లో గల వినాయకుడి గుడివల్ల నాలుగు సిమెంట్ బల్లలను శ్రీలక్ష్మి బుధవారం ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ పాదచారులు కూర్చోవడానికి ఉపయోగకరంగా బల్లలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ట్రెజరర్ మలాది మలాది శ్రీనివాసరావు, షేక్ మహమ్మద్ రఫీ, యు. దేవపాలన, విద్యావన్ జ్యోతి చంద్రమౌళి, కాకర్ల వెంకటేశ్వర్లు, అళహరి హరిప్రసాద్, గోరంట్ల లక్ష్మీనారాయణ, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, అంజాద్‌బాషా, తత్మన శ్రీనివాసరావు, గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న డీవీఈవో యర్రయ్య

బల్లికురవ: విద్యార్థులు లక్ష్యంతో కష్టపడి.. ఇష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని డీవీఈఓ యర్రయ్య కోరారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న 92 మంది విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌ను అందజేశారు. గత విద్యా సంవత్సరంలో బల్లికురవ జూనియర్ కళాశాలల జిల్లా స్థాయిలో మెదటి, రెండు స్థానాలను కైవసం చేసుకోవడంతో అభినందించారు. ప్రిన్సిపాల్ యం. అనిల్ కుమార్ అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యవసాయ స్థితిగతులపై సర్వే



షేడ్ నెట్ వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న మలేషియా బృందం, స్థానిక రైతులు

మార్టూరు: మలేషియా నుంచి వచ్చిన ప్రత్యేక బృందం మండలంలో సాగు చేస్తున్న షేడ్ నెట్ కల్చర్, ప్రకృతి వ్యవసాయాల గురించి బుధవారం పరిశీలించారు. మండలంలోని బొబ్బేపల్లి గ్రామ సమీపంలో గల దండుదారి వద్ద గల దండా రామస్వామి విజిటబుల్ నర్సరీలో సుమారు 100 ఎకరాల్లో సాగులో ఉన్న కూరగాయలు, పండ్ల మొక్కల పెంపకం గురించి నర్సరీ యజమానులు దండా వీరాంజనేయులు శ్రీనివాసరావులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్టూరు కేంద్రంగా యువ రైతు పెంటేల శరత్ ఆధ్వర్యంలో సాగు చేస్తున్న ప్రకృతి సేంద్రియ వ్యవసాయ విధానాలను తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలను పండించే విధానాల గురించి తెలుసుకున్నారు.

గ్రానైట్ లారీ బోల్తా



బోల్తా కొట్టిన గ్రానైట్ లారీ

బల్లికురవ: అదుపుతప్పిన గ్రానైట్ లారీ రోడ్డు మార్జిన్‌లో బోల్తా కొట్టింది. ఈ ఘటన బుధవారం బ ల్లికురవ, కొణిదెన రోడ్డులోని ఎత్తిపోతల పథకం సమీపంలో చోటు చేసుకుంది. ఈర్ల కొండ నుంచి ముడిరాయితో వెళుతున్న లారీ రోడ్డుపై ఉన్న గోతులను తప్పించే క్రమంలో అదుపుతప్పి పల్టీ కొట్టింది. డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించటంతో ప్రమాదం తప్పింది. గ్రానైట్ రాయి ఐదు అడుగుల మేర ఎగిరి పడింది.

ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యం



జె.పంగులూరు: బిడ్డకు తల్లిపాల ఆవశ్యగత గూర్చి వివరిస్తున్న డాక్టర్ శివచెన్నయ్య



కారంచేడులో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు

జె.పంగులూరు: తల్లిపాలలో ఇమ్యూనిటీ శక్తి ఉంది అని తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శివచెన్నయ్య అన్నారు. మండలం పరిధిలోని ముప్పవరం సెక్టర్‌లో ముప్పవరంలో బుధవారం తల్లిపాల వారోత్సవం జరిగింది. డాక్టర్ శివచెన్నయ్య మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు ఇస్తే బిడ్డకు ఎంతో ఆరోగ్యంగా ఉంటుందని, ఎలాంటి వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. కొంత మంది తల్లులు పిల్లలకు తల్లిపాలకు బదులుగా హార్లిక్స్, డబ్బా పాలు ఇస్తుంటారని, వీటి వల్ల పిల్లలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. తల్లి పాలలో బిడ్డకు కావాల్సిన అన్ని పోషకాలు ఉంటాయని తెలిపారు. తల్లులందరూ తమ బిడ్డలకు తమ పాలే ఇవ్వాలని ఆయన కోరారు. అనంతరం సీడీపీఓ కృష్ణకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే బాలామృతాన్ని ద్రవ రూపంలో పిల్లలకు అందిస్తే అవి కూడా తల్లిపాలతో సమానం అని తెలిపారు. తల్లులు కూడా తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆకుకూరలు ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలని, అలా తీసుకుంటే బిడ్డలకు అవసరమైన పాలు ఏర్పడతాయని, తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. సూపర్ వైజర్ యస్. పద్మజ, ఏఎన్ఎం ప్రసన్న, ఆశ వర్కర్ శ్రీలక్ష్మి, సుధా, శ్యామల పాల్గొన్నారు

కారంచేడు: బిడ్డ పుట్టిన ఒక గంట సమయం లోపులోనే మీ బిడ్డలకు తల్లులు కచ్చితంగా ముర్రుపాలు పట్టించాలని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. షాలిని అన్నారు. బుధవారం ఆమె మండలంలోని స్వర్ణ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో పాల్గొని తల్లులు, గర్భిణులు, మహిళలకు తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. తల్లి పాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమన్నారు. వాటి వలన బిడ్డలకు మంచి పోషకాలు అందుతాయన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి వి. నాగేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ మీనాకుమారి, హెల్త్ విజిటర్ మాధురీ సిఫోరా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, సులోచన, శివ, అనిత, కృష్ణవేణి, శ్రీదేవి, సువర్ణ, ఏఎన్ఎంలు, ఆశలు, ఉపాధ్యాయులు, గర్భిణులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో 10,11 సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లులకు అవగాహన కల్పించి, ర్యాలీ చేశారు.

చీరాల టౌన్: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలను అందిస్తే వ్యాధులు దరిచేరవని, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సూపర్ వైజర్లు సునంద, విజయలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని ఈపురుపాలెం 40 ఇళ్ల కాలనీ, విజయనగర్‌కాలనీ, వాడరేవు, బుర్లవారిపాలెం, తోటవారిపాలెం గ్రామ పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యాన్ని తెలపడంతో పాటు ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు, పథకాలను కరపత్రాలతో గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించారన్నారు చిన్నారులకు రెండేళ్లవరకు విధిగా తల్లిపాలు అందించాలని, తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందించే పోషకాహారాన్ని అందించాలన్నారు. గర్భిణులు కాన్పులను ప్రభుత్వ వైద్యశాలల్లోనే చేయించుకోవాలన్నారు. ప్రసవాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగంచేసుకోవాలన్నారు.

తల్లిపాల విశిష్టత తెలియజేయాలి

పర్చూరు (చిన్నగంజాం): తల్లిపాల విశిష్టత గురించి అందరికీ తెలియజేయాలని పర్చూరు సీడీపీఓ సుభద్ర తెలిపారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన తల్లిపాల ముగింపు వారోత్సవాల కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టత గురించి వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్లకార్డుల ద్వారా తల్లిపాల గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. శిశువు పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టే విధంగా వారికి తల్లులకు అవగాహన కల్పించాలని కోరారు. పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇస్తే వారు చాలా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, దీపాదేవి, రాధ, సుజాత, పద్మావతి, శిరీష, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేటపాలెం: బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల రోగని రోధక శక్తి పెరుగుతుందని వైద్యాధికారి స్వాతి కిరణ్ పేర్కొన్నారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో తల్లిపాల వారోత్సవాల ముంగింపు సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డుకు శ్రేష్టమన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లలకు బ్రెస్ట్ కాన్సర్ రాకుండా కాపాడు కోవచ్చని తెలిపారు. సీహెచ్‌వో జి. గురువమ్మ, సీహెచ్‌ఓ ఏ సుగుణ్‌కుమార్, ఏఎన్ఎం డి. ఇందిరా ప్రియదర్శిని, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



తల్లిపాల గురించి ప్రచారం నిర్వహిస్తున్న సీడీపీఓ



మాట్లాడుతున్న వైద్యాధికారి స్వాతి కిరణ్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



రోడ్డు పక్కనే కుప్పలుగా ఉన్న వ్యర్థాలు



మురుగు నీటిపై నిలిచిన దోమలు



డాక్టర్ నిఖిలారెడ్డి

మేదరమెట్ల: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేదరమెట్ల యర్రంచినపోలిరెడ్డి ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ నిఖిలారెడ్డి హెచ్చరించారు. వర్షాకాలంలో కలుషితమైన నీటిద్వారా వచ్చే వ్యాధులు, దోమల ద్వారా వచ్చే వ్యాధులు ఉంటాయన్నారు. కలుషితమైన నీరు, ఆహార పదార్థాలు తీసుకోవడం వలన టైఫాయిడ్, నీళ్లవిరేచనాల వ్యాధులు వస్తాయన్నారు. దోమల వల్ల మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. టైఫాయిడ్ ఉంటే తీవ్రమైన జ్వరం, చలి, వంటినొప్పులు, వాంతులు, తలనొప్పి రావడం వంటివి ఉంటాయని తెలిపారు. రోగాన్ని గుర్తించి మందులు వాడకపోతే రోగికి విరోచనాలు, కడుపునొప్పి రావడంతోపాటు పేగుల్లో రంధ్రాలు ఏర్పడతాయని చెప్పారు.మలేరియా ముదిరిన దశలో రోగి రక్తహీనతకు గురవుతారని చెప్పారు. కాచి చల్లార్చిన నీరు తాగడం, వేడి ఆహార పదార్థాలను తినడం, ఈగలు, దోమలు వాలకుండా మూతలు పెట్టి ఉంచిన ఆహారం తాగడం, తాగే నీరు క్లోరినేషన్ చేయించడం, దోమల కాటుకు గురికాకుండా దోమతెరలు వాడటం చేయాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగ నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవడం, మురుగునీటి గుంతల్లో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని, నిపుణులైన వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలని డాక్టర్ నిఖిలారెడ్డి సూచించారు.

ఉద్యమాన్ని ఉధృతం చేయాలి

● నల్లమడ రైతు సంఘం పిలుపు
● గుంటూరు చానల్ పొడిగించాలని డిమాండ్
● స్థల సేకరణ కోసం ప్రభుత్వం వెంటనే రూ. 115 కోట్లు విడుదల చేయాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లా రామ్మోహన్

పర్చూరు (చినగంజాం): గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ పిలుపునిచ్చారు. రైతులందరూ ఐక్యతగా ఉండి పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఆసన్నమైందని తెలిపారు. 75 సంవత్సరాల నుంచి పోరాటం చేస్తున్నా ఎవరూ కనికరించటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక కొల్లావారి కల్యాణ మండపంలో జరిగిన నల్లమడ రైతుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దశాబ్దాల నుంచి రాజకీయ నాయకులకు విన్నపాటు, వినతిపత్రాలు ఇచ్చి విసుగుచెందినట్లు తెలిపారు. ఇక ఆ స్థాయి దాటి పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు చానల్ పొడిగించటానికి అనేక సార్లు నిరాహార దీక్షలు చేసినప్పటికీ పట్టించుకున్న పాపానపోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఈ ఉద్యమాన్ని ఉధృతం చేయటం తప్ప తమకు మరోమార్గం లేదన్నారు. చానల్ పొడిగింపు వల్ల పత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు, పర్చూరు మండలాల్లోని 50 గ్రామాలకు పైగా తాగు, సాగునీరు పుష్కలంగా అందుతాయన్నారు. చానల్ పొడిగింపు కొరకు స్థలసేకరణ కోసం ప్రభుత్వం వెంటనే రూ. 115 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు కొల్లా రామన్, మానం విజేత, మహ్మద్‌బాషా, కోటా హరిబాబు, నరసింహారావు, అడితి బ్రహ్మం, రవిచంద్ర, చౌదరిబాబు, శ్రీనివాసరావు, వినయ్‌కుమార్, అంకమ్మ పాల్గొన్నారు.

రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టిన బైక్

అద్దంకి రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టటంతో ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం రాత్రి అద్దంకి మండలంలో చోటుచేసుకుంది. కొప్పరపాడు గ్రామానికి చెందిన జి. పేతురు, మరియదాసులు ప్రార్థనలో పాల్గొనేందుకు అద్దంకి నుంచి బైకు వెళుతున్నారు. మార్గమధ్యంలోని అద్దంకి నార్కెట్‌పల్లి నామ్‌రహదారిపై ఉన్న గోపాలపురం సమీపంలోకి రాగానే రోడ్డు దాడుతున్న అంజయ్యను ఢీకొట్టటంతో బైక్‌పై ఉన్న పేతురుకు, రోడ్డు దాటుతున్న అంజయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్ తరలించారు.

ఘనంగా చేనేత దినోత్సవం

చీరాల అర్బన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చేనేత నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ప్రగడ కోటయ్య చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ కౌన్సిలర్లు మల్లెల లలిత, గోలి జగదీష్, తోకల అనిల్, బత్తుల అనిల్, గొట్టిపాటి ఎబినేజర్, గుంటూరు ప్రభాకరరావు, పార్టీ నాయకులు కోడూరి ప్రసాద్‌రెడ్డి, గోసాల అశోక్, చిలుకోటి శ్రీను, బడుగు విమలాకర్, వాసిమళ్ల వాసు, మున్సిపల్ సిబ్బంది హాజరయ్యారు.



ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

చెరుకూరులో కౌలు వేలంపాట నేడు

చినగంజాం (పర్చూరు): మండలంలోని చెరుకూరు గ్రామంలో వేంచేసి ఉన్న త్రివిక్రమ, అగస్త్యేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలో గురువారం ఉదయం 65 ఎకరాల దేవుడిమాన్యం భూముల వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగయ్య బుధవారం తెలిపారు. రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. వేలంపాట అనంతరం దేవస్థానం హుండీ లెక్కింపు జరుగుతుందని చెప్పారు.

చీరాల రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఎంపీ



నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీ

చీరాల అర్బన్: చీరాల రైల్వేస్టేషన్‌ను బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్ బుధవారం రాత్రి పరిశీలించారు. జాతీయ చేనేత దినోత్సవంలో పాల్గొనేందుకు చీరాల వచ్చిన ఆయన అనంతరం చీరాల రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్లాట్‌ఫాంలు, కొత్తగా ఏర్పాటు చేసిన భవనాల గురించి రైల్వేస్టేషన్ అధికారులను వాకబు చేశారు. అనంతరం ప్రయాణికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు.

లెసన్ ప్లాన్ లేకుండా బోధన చేస్తారా?



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న అధికారి

అద్దంకి: విద్యార్థులను ఈ నెలలో నిర్వహించనున్న ఫార్మేటివ్ పరీక్షలకు సిద్ధం చేయాలని గుంటూరు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు బి. లింగేశ్వరరెడ్డి ఆయన బుధవారం అద్దంకిలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించి గ్రేడులు నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తరగతిగదిలో ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్ లేకుండా బోధన చేయడంతో మందలించారు. లెసన్ ప్లాన్ లేకుండా బోధన ఎలా చేస్తారని ప్రశ్నించారు. తరువాత విద్యార్థుల సామర్థ్యలను పరిశీలించారు. అన్ని పాఠశాలలో ప్రతి టీచర్ తరగతిగదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, పాఠ్య ప్రణాళికతో బోధన జరిగేలా చూడాలని మండల విద్యాశాఖధికారి డి. గంగాధరరావును ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు డి.యస్. పద్మావతి, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రామకృష్ణా రెడ్డి మృతికి సంతాపం



రామకృష్ణారెడ్డి (ఫైల్)

పర్చూరు (చిన్నగంజాం): నూతలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వల్లభరెడ్డి రామకృష్ణా రెడ్డి మృతి పట్ల పలువురు నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. బుధవారం వేకువజామున గుంటూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని సందర్శించిన పలువురు నాయకులు రామకృష్ణారెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానంద రెడ్డి, బాపట్ల జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి, నాయకులు దాసరి వెంకట్రావు, బాపిరెడ్డి తదితరులున్నారు.

కళాశాలలో గ్రంథాలయం ప్రారంభం



కళాశాలలో గ్రంథాలయం ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి

జె.పంగులూరు: విద్యార్థులు విద్యాస్థాయి పెరగాలంటే పుస్తకాలం చదవడం వల్లే అది సాధ్యం అని కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి అన్నారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ మేకల ఉషారెడ్డి గ్రంథాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని పెంపొందించుకొని మంచి ఉద్యోగ అవకాశాన్ని పొందాలని ఆకాంక్షించారు. ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలు చదవడం మానేశారన్నారు. పుస్తకాలు చదవడం పెంపొందించడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగ పడతాయని తెలిపారు. అనంతరం పంగులూరు గ్రంథాలయ అధికారి కనుమూరి సంజయ్ బాబు విద్యార్థులకు పుస్తక పఠనంపై పలు సూచనలు చేశారు. పీడీ మేకల సీతారామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగు నీటి కోసం పాట్లు



సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వినియోగానికి అనువుగాలేని పంపు

చీరాల టౌన్: మండలంలోని బుర్లవారిపాలెం గ్రామ పంచాయితీ సాయికాలనీలో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డుకు మంచినీటి పంపు అడ్డుగా వచ్చిందేమో కానీ.. షాలో బోర్‌ను అలాగే ఉంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో మంచినీటిని పట్టుకునేందుకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. చేనేతలు, రోజువారీ కూలీలు అధికంగా నివసించే సాయికాలనీ గ్రామంలోని ప్రజలు తాగు నీటికి షాలో బోర్లనే వినియోగిస్తుంటారు. అయితే నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డును సైతం చేతిపంపు వినియోగంలోకి లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో మంచినీటిని పట్టునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేతిపంపును వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

చీడపీడల నివారణ ముఖ్యం



సోమవరప్పాడులో పత్తి పైరు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

బల్లికురవ: పత్తి పైరును పచ్చదోమ, రసం పీల్చే పురుగు ఆశించిందని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి తెలిపారు. బుధవారం ఉప్పుమాగులూరు రైతు సేవా కేంద్రం పరిధిలోని సోమవరప్పాడులో సాగుచేసిన పత్తి పైరును పరిశీలించారు. మోనో క్రోటోఫాస్ 1.5 ఎంఎల్ లేదా ఎస్పేట్ లీటరు నీటితో కలిపి మొక్క తడిసేలా పిచికారీ చేసకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు

చీరాల అర్బన్: బాధిత మైనార్టీ కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. ఈపూరుపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ ఆరీఫ్ అనే యువకుడిని కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపడం చీరాల ప్రాంతంలో ఎన్నడూ లేదన్నారు. గత రెండు నెలల్లో ఎన్నో అవాంఛనీయ సంఘటనలు జరిగాయని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని తెలిపారు. లా అండ్ ఆర్డర్ చేతిదాటి పోయిందని, నేర ఘటనలు ఎక్కువగా జరుగుతున్నా వాటిని కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం సెక్రటరీ యాతం మేరిబాబు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ముస్లిం మైనార్టీలు నిర్వహించిన రాస్తారోకోలో పాల్గొని మద్దతు తెలిపారు.